చట్టం సాహితీ లోకం 95814 19999

## విచ్చుకతలు (పద్యములు)



**1.ఆ.వె:**

'పిలుపు' వినుచు మనసు తలచెను 'పాశము',
'నాకవిభుని వాహనంబు' కడకు
పోయి పిలువగాను హాయి కలిగెనుగా,
అట్టి పదము జెప్పు దిట్ట యెవరు?

పిలుపు పదము సమముం పాశము పదము సమము
= నాక విభుని వాహనము పేరు సమమురి

**2.ఆ.వె:**

'అందము' ను కలిగిన అతివను జూడగా,
'అండ' కొరకు వెతకె నను తోడ,
ఇచ్చె సంఘ జనులు నిచ్చగింతను గాదె,
అట్టి జనులను గన తిట్టరాదు!!

అందము పదము సమముం అండ పదము సమము
= ఇచ్చగింత పదము సమమురి

**3.ఆ.వె:**

'వెఅపు' తోడ 'లజ్జ' ప్రేముడి జేయుచు
ప్రేమ లోన పడెను వింతగాను,
తగిలినంత మేను 'మొగమాటము' పడెను,
ఇట్టి వారి కేల యింపు కృష్ణ!!

వెఅపు పదము సమముం లజ్జ పదము సమము
= మొగమాటము పదము సమమురి

**సమాధానములు:**

1. సదాదానము
2. సమాధానము
3. జంకునాన

డాక్టర్ కురవి వేంకట కృష్ణ శాస్త్రి, చెన్నై

చట్టం సాహితీ లోకం 95814 19999

## నిన్ను నీలో చూసుకో..నిన్ను నీవు తెలుసుకో

( Look With in and Find Yourself)



బ్రతుకు అద్దం లాంటిది..
చూసిన కొద్దీ..మన ప్రతి బింభమే
కాన వస్తుంది..కనిపిస్తుంది.
మనని మనం చూసుకొంటే..తెలుసుకున్నట్టే.

నీ మనస్సాక్షి ని మించిన
అద్దం..మరొకటి లేదు.
ఆత్మ ప్రభోదాన్ని మించిన
గురువు లేదు.

మన నడత, ప్రవర్తన
మన గుణ గణాలకు కొలమానం.
నయ వంచనలతో, నటనతో
ప్రవర్తిస్తే..అది బూటకపు బతుకవుతుంది.

ఆత్మ విమర్శలు , సత్య శోధనలు
సత్ ప్రవర్తన కు పడి కట్లు.


సమాజ కట్టు బాట్లు, కుటుంబ
అనుబంధాలు.. రుజు ప్రవర్తనలు
మానవుని.." మా " ననీయునిగా
సన్మార్గునిగా తీర్చిదిద్దుతాయి.

ఇతరులు మన గురించి
మంచిగానో, చెడు గానో చెప్పుకొనే
అవకాశం.. నిన్ను నువ్వు
చూసుకొని, ప్రవర్తిస్తే..రాదు..రాబోదు..!

విజయకుమార్ గడియా
బెంగుళూరు.

చట్టం సాహితీ లోకం 95814 19999

## నడక ఆధునికం నడత ఆటవికం



ఆటవికమని తెలిసినా ఆధునికమనే భ్రమలో,ఊహల్లో విహరిస్తూ యువత ఆనందాన్ని ఆస్వాదిస్తున్నది.
సామాజిక మాధ్యమాల్లో విహరిస్తూ,వాస్తవాన్ని విస్మరిస్తున్నది.
వర్తమాన ప్రపంచం వికృతాలకు నిలయంగా మారింది. సహజత్వం తగ్గింది.
నటనలో మోతాదు పెరిగింది.
కల్తీ మనుషుల మనసుల్లో స్వచ్ఛతకు తావెక్కడ?
సమాజం ఆధునికం-మనసులు ఆటవికం.
పైకి సాత్వికం,లోపల రాక్షసం.
నడక నాగరికం,నడత ఆటవికం.
ఇదే నవ నాగరికం.
తీరుతెన్నూ లేని అనాగరికం.
దేహాలన్నీ డాంభికాలు.
మనసులన్నీ దుర్గంధాలు.
స్నేహాలన్నీ నాటకాలు.
బంధాలన్నీ బూటకాలు.
మాటలన్నీ నీటి మూటలు.
శుష్క ప్రియాలు-శూన్య హస్తాలు.
జీవితం ఒక అగాధం.
ఇదొక తాత్కాలిక మాయాజాలం.
అందమైన ప్రకృతిలో
ఆనందాల ముంగిట్లో, ఆప్యాయతల లోగిట్లో
మానవతా లతలతో వికసించిన పూదోటలాంటి
అలనాటి మనుషుల మనసులకు వారసులెక్కడ?
పంపకాల్లో చూపే మమకారం
పెంపకాల్లో కానరాదెందుకో?
సహృదయాల నడుమ కొలువుదీరిన నాటి
సమాజపు ప్రాభవం నేడెందుకు
నీరుగారి,నిస్సహాయమై అలమటిస్తున్నది?
దేహంపై దుస్తులు బరువాయె!
అప్యాయతలే కరువాయె!!
బంధాలు,సంబంధాలు స్వేచ్ఛ పేరుతో సంకెళ్ళు త్రెంచుకుని, ఎగిరిపోయిన పక్షుల్లా
చెల్లా చెదురాయె!
కరెన్సీ కట్ల పాముల మీద పవళిస్తూ,
అదే జీవితమని భ్రమించడమే ఆధునికమా?
గతకాలపు మైత్రీభావ వైభవ పునర్నిర్మాణం
చెదిరిన స్వప్నమేనా?
నాడు కురిసిన మానవత్వపు సుగంధాల
జడివాన కనీసం
చిరుజల్లుగా నైనా హృదిని తాకునా?
ఆనందపు వెన్నెల జల్లుల్లో... తడిసి వికసించిన
జీవన కుసుమాలు వాడి పోయి
ఎడారిలో ఎండమావుల మధ్య నీటి తుంపరుల
స్పర్శ కోసం ఆరాట పడుతున్నాయి.
నిష్ప్రయోజనమని తెలిసినా
నిరీక్షిస్తున్నాయి.

-సుంకవల్లి సత్తిరాజు.
(సామాజిక విశ్లేషకులు,మోటివేషనల్ స్పీకర్)

చట్టం సాహితీ లోకం 95814 19999

## మద్దులవిరిచె వీడు ముద్దుకృష్ణుడు



మద్దుల విరిచినాడు ముద్దు కృష్ణుడు
పెద్దకొండనెత్తి దేవేంద్రుని వివశుజేసెను

కాళీయుని పడగలపై కేళీ ఘటియించెను
బాలకుడై నోటిలో బ్రహ్మాండము జూపెను
ఆలమందగాచె బాలకులతో నాటలాడెను
ఏలె పదార్వేలింతుల నింతికిడె వల్వలను

బలిని పాతాళమున బంధించి తీవట
అలుగువై త్రిపురాల నార్పి వేసితివట
ప్రళయానిలము భృగుగర్వ మూడ్చితివట
ఉలికిపడ కంసాదులకు ధూమకేతువట

పాలుగ్రోలుచు పూతన ప్రాణములు గొంటి
పాలిపంచాయతి పాండవ జయమొసగి
కొలిచె వారికి వరగిరులు తరు లందించ
వెలసితివి తిరుమల వేంకటనాథ శరణము

రచన::శంకర్ జీ డబ్బికార్
ఊరు::ఇబ్రాహీంపట్నం రంగారెడ్డి
చరవాణి::9160297956

చట్టం సాహితీ లోకం 95814 19999

## శ్రీరామ నామ దివ్య సంకీర్తన



శ్రీరామ నామ మహిమ తెలియరా
జయ జయ రామ యనుచు పాడరా
కౌసల్య తనయుడు కమనీయ రూపుడు
దశరథ తనయండు దైర్యవంతుడతడు
శ్రీరామ
తపసి యాగము గావగ రక్కసులను దునుమాడె
తన పాదదూళితో రాతి నాతిగ మారె
శివుని విల్లును విరచి సీతను పెండ్లాడె
పరశురాముని గర్వ భంగమును ఒనరించె
శ్రీరామ
తండ్రి మాటను నిలుపగ అడవులకే ఏగె
సీత కోరికపై మాయలేడిని వెంటాడె
దశకంఠుడు సీతను అపహరించగా
సీత కోసం అయ్యో అతిగా దుంఖించె
శ్రీరామ
సుగ్రీవునితో చెలిమిని ఒనరించె
సుగ్రీవుని అన్న యగు వాలిని తెగటార్చె
హనుమంతుని శ్రీ లంకకు పంపించె
వారధి కట్టించి లంకాపురికి చేరె
శ్రీరామ
లక్ష్మణుని మూర్ఛతో చింతించి ఎంతో వగచె
ఆంజనేయుడు ఏగి సంజీవినిని తెచ్చె
రావణుని చంపి, సీతకు అగ్ని పరీక్షను పెట్టె
అయోధ్యకు ఏగి పట్టాభిషేకం చేసుకొనె
శ్రీరామ

అక్కి నర్సింలు గౌడ్
విశ్రాంత ఉపాధ్యాయుడుస్థ
మల్లాపూర్ రంగారెడ్డి

చట్టం సాహితీ లోకం 95814 19999

## ఋణం



కష్టం ఇష్టంలా కౌగిలిలో బంధించి ఊపిరి ఆడకుండా చేస్తుంది..
ఎందులో వేలు పెట్టినా నష్టం అదృష్టంలా పలకరించి..
తెల్లని కాగితం మీద పిచ్చి గీతలు గీసేసింది..
ఎచ్చోట అడుగు పెట్టినా అడుగుకో సమస్య..
ఎపుడు పేలుతుందో తెలియని మందుపాతరలా వణికిస్తోంది..
ప్రకృతి పగబట్టి పచ్చని జీవితాన్ని నిప్పుల వానతో..
జాలి లేని కసాయిలా
మరు భూమిగా మార్చేసింది..
ఎడారిలో నిరాశల ఊబిలో చిక్కుకుని చేయందించే..
అదృశ్య శక్తి కోసం తపన పడుతున్న మసక చీకటిలో..
వెలుగు రేఖలా అనుకోని అతిధిలా తళుక్కున మెరిసింది..
తొలకరి ప్రేమ జల్లు కురిపించి నాలో ఆశల విత్తనాలు చల్లింది..
మమతల మబ్బుల పైటకొంగుతో
చల్లని నీడను పంచింది..
ఆగిన నడకను తడబడి సాగే అడుగులకు..
దన్నుగా మారి తోడైన
సహచరికి ఏమిచ్చి ఋణం తీర్చుకోను..
గుండెల్లో గుడి కట్టి నిత్యం ఆరాధిస్తున్నా కృతజ్ఞతగా..!

గోవర్ధన్ ఆముదాలపల్లి

# సౌందర్ రాజన్ మృతికి సిఎం రేవంత్ సంతాపం

### సంతాపం ప్రకటించిన మాజీ సిఎం జగన్

హైదారాబాద్,ఫిబ్రవరి27 : ప్రముఖ పుణ్యక్షేత్రం చిలుకూరు శ్రీ బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సౌందర రాజన్ మరణించారన్న వార్త తెలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం అధ్యాపకుడిగా, రిజిస్ట్రార్‌గా ఎంతో మంచి పేరు గడించిన సౌందర రాజన్ ఆధ్యాత్మిక చైతన్యం విస్తరింపజేయడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. చిలుకూరు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు. సౌందర రాజన్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ దుఃఖ సమయంలో వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించాలని భగవంతుడిని ప్రార్థించారు. సౌందర రాజన్ మృతిపట్ల ముఖ్యమంత్రి వారి కుటుంబానికి, శ్రేయోభిలాషులకు సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. చిలుకూరు ఆలయ ప్రధాన అర్చకులు సౌందరరాజన్ మృతిపై మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. దశాబ్దాలపాటు చిలుకూరు బాలాజీ స్వామి సేవలో అంకితభావంతో పనిచేశారని తెలిపారు. గొప్ప అధ్యాత్మికవేత్తగా గుర్తింపు పొందారని వివరించారు. ఆయన మరణం ఆధ్యాత్మిక రంగానికి తీరనిలోటని తెలిపారు.

చట్టం సాహితీ లోకం 95814 19999

## సైన్స్...!



మానవ జీవనానికీ మార్గము
సాంకేతిక అభివృద్ధికీ గమ్యము
నూతన మార్పుకు ఆధారము
కొత్త ప్రక్రియల సమ్మేళనము
సైన్స్.
లభించే ప్రతి సౌకర్యం
వినియోగించే ప్రతి పదార్థం
శోధించి సాధించి
పరిశోధించి తేల్చినవే
అవసరానికి అందుకున్నవే.!
ఏ రంగం అయినా
ఏ కాలమయినా
ఏ ఖండమయినా
సైన్స్ మార్గదర్శనమే కీలకం
దేశ అభివృద్ధిలో ప్రాధాన్యం
ఉద్యోగ కల్పనలో
ఉపాధి అవకాశాలు పెంచుటలో
వ్యాపార వాణిజ్యంలో
మానవ భవిష్యత్తు లో
కీలక పాత్ర పోషించేది సైన్స్
ముఖ్య కర్తవ్య భూమిక సైన్స్.

డా.యణమనగండ్ల రాజేందర్
వికాస వేదిక కార్యదర్శి
ఇల్లందు, భద్రాద్రి కొత్తగూడెం



చట్టం సాహితీ లోకం 95814 19999

## "మనది అనే మనసే మానవత్వం"



ఎదుటివారిని ఎలా హింసించాలి?
ఎలా అణగదొక్కాలి?
అనే ఈర్ష్యా--అసూయలతో
పైశాచికానందం పొందుతూ
విర్రవీగుతోంది ఈ లోకం.

అహంకారం, స్వార్థం
అధికమైపోయాయి;
"నాది", "మాది" అనే మాటలే
ప్రతిధ్వనిస్తూ,
"మనది", "అందరిదీ" అనే భావాలు
ఆణిముత్యాలై అరుదైపోయాయి.

తనను పొగిడేవారే చుట్టూ ఉండాలని
ఆకాంక్షించే మనుషులు,
తామే మాత్రం అందర్నీ విమర్శిస్తూ
న్యాయాధిపతులై కూర్చున్నారు.
ఇలా సాగుతోంది ఈ వ్యవస్థ.

ఎదుటివారిలో ఎంత ప్రతిభ ఉన్నా,
ఎంత వినయం, విధేయత ఉన్నా,
ఎంతగా రాణించినా,
వారిని తక్కువ చేసి చూపే ప్రయత్నమే;
కానీ తమవారు
అప్రయోజకులైనా, అవివేకులైనా
వారికే కిరీటాలు పెట్టి
సమాజాన్ని అల్లకల్లోలం చేస్తున్నారు.

"కులం లేదు, మతం లేదు
అంతా ఒకటే" అంటూ
తీయగా పలుకుతారు;
అవసరాలు తీరగానే
"మా మతం, మా కులం, మా దేవుడు" అంటూ
హుంకరిస్తారు.

ఇది మారాలి.
మనసులు మారాలి.
ఈర్ష్యకు బదులు ప్రోత్సాహం,
అసూయకు బదులు అభినందనం,
అహంకారానికి బదులు వినయం
స్థానం పొందాలి.


"నాది" అనే గోడలు కూలి,
"మనది" అనే వంతెనలు నిర్మితమైతేనే
సమాజం సుస్థిరంగా నిలుస్తుంది.

మనిషిని మనిషిగా చూడగలిగితే
అదే నిజమైన మతం,
అదే నిజమైన మహత్తు.

మిత్రాజి
( గుండవరం ప్రభాకర్ రావు పంతులు)
అత్వెల్లి,
మేడ్చల్ జిల్లా.

చట్టం సాహితీ లోకం 95814 19999

## ప్రతీకారం అశాంతికి ప్రతీక



పరమాత్ముడు ప్రసాదించిన మానవజీవితం
పెదవులపై చిరునవ్వుతో అనురాగ ఆప్యాయతలతో
సమాజాన ఉన్న ప్రజలతో మమేకమై
అసూయ ద్వేషాలతో పగ ప్రతీకారాలు లేక
ఎవరేమన్నా అనుకున్నది సాధించినపుడు
ఆశయం నెరవేరినపుడు కలిగే ఆనందం వర్ణింపతరమా.
ఏ సమస్య ఎదురైన దానికి పరిష్కారం
ప్రతీకారం కాకూడదన్న
జాతిపిత మహాత్ముడు,గౌతమబుద్ధుని అడుగుజాడల్లో
నడచి
మృదు భాషణం యుక్తాయుక్త విచక్షణతో
పరిష్కరించుకోవాలి
భారతంలో ప్రతీకారంతో వినాశనమైన కౌరవులు
రామాయణంలో రావణ బ్రహ్మ ఎన్నో
ఎన్నెన్నో పురాణ గాధలు
నేడు దేశాల మధ్య జరుగుతున్న
యుద్ధాలవల్ల జరుగుతున్న మారణహోమాలు
పగలు ప్రతీకారాలు
మంటకు ఆజ్యం పోసి రగిల్చినట్లే
మానసిక అశాంతికి ప్రతీకలు...!!
..........................

కవి మిత్ర, సాహిత్య రత్న
ఆచార్య అయ్యలసోమయాజుల ప్రసాద్.
(పుష్యమి)
విశాఖ పట్నం

